VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శనివారం 20 జూలై 2024


వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 363

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



2లో

8కోట్ల ఉద్యోగాల సృష్టి..మరో ట్రాష్



2లో

## గ్రూప్-2 పరీక్షలు వాయిదా

ఆగస్ట్ నుంచి డిసెంబర్‌కు వాయిదా వేస్తూ నిర్ణయం



2లో

## ఉజ్జయిని మహంకాళి బోనాలకు భారీగా ఏర్పాట్లు

ఆది,సోమవారాల్లో రెండు రోజులు బోనాల ఉత్సవాలు

1500 మంది పోలీసులతో భారీగా బందోబస్తు

మహిళ భద్రత కోసం షీ టీంల గస్తీ

క్యూ లైన్లలో కలిపి మొత్తం 100 సీసీ కెమెరాలు

హైదరాబాద్ నార్త్ జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ వెల్లడి



# ప్లేస్కూళ్ల తరహాలో అంగన్‌వాడీలు

**మూడో తరగతి వరకు అక్కడే విద్యాబోధన**

**ప్రతి కేంద్రానికి ఒక టీచర్ నియామకం**

**4 నుంచి 12వ తరగతి వరకు సెమీ రెసిడెన్షియల్ బడులు**

**విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెస్తాం**

**విద్యావేత్తలు, విశ్రాంత ఐఏఎస్ అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి**

**త్వరలో విద్య, వ్యవసాయ కమిషన్లు ఏర్పాటు చేస్తామని వెల్లడి**

**హైదరాబాద్:** విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్లేస్కూళ్ల తరహాలో అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దడంతో పాటు అక్కడే మూడో తరగతి వరకు విద్య అందించే దిశగా ప్రతి కేంద్రంలో విద్యాబోధనకు ఒక టీచర్‌ను నియమించాలని యోచిస్తున్నామన్నారు. శుక్రవారం సచివాలయంలో విద్యావేత్తలు, విశ్రాంత అధికారులతో సీఎం సమావేశమయ్యారు. విద్యారంగంపై, ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై చర్చించారు. ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ప్రొఫెసర్లు హరగోపాల్, కోదండరాం, జానయ్య, పద్మజా షా, విశ్వేశ్వరరావు, శాంతా సిన్హా, విశ్రాంత ఐఏఎస్ అధికారులు ఆకునూరి మురళి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. “నేను, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నాం. ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతానికి కచ్చితంగా బడ్జెట్ పెంచుతాం. 4 నుంచి 12వ తరగతి వరకు సెమీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పిల్లలు చదువుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులకు ఉచిత రవాణా సదుపాయం కల్పించేందుకు యోచిస్తున్నాం. గురుకుల పాఠశాలలకు సమాంతరంగా సెమీ రెసిడెన్షియల్ స్కూల్స్ కొనసాగిస్తాం. విద్య, వ్యవసాయ రంగాల సమస్యల పరిష్కారానికి త్వరలో కమిషన్లు ఏర్పాటు చేయబోతున్నాం. విద్యా కమిషన్ ద్వారా విద్యారంగ సమస్యలన్నీ పరిష్కరిస్తాం. కార్పొరేట్ బడుల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించాం. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యత ఇప్పటికే స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించాం. యూనివర్సిటీలకు వీసీలు, బోధన, బోధనేతర సిబ్బందిని నియమిస్తాం. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు మొదలు విశ్వవిద్యాలయాల వరకు నాణ్యమైన విద్యాబోధన, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. విద్యావ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా 11 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టుల నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేశాం. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాం. విద్యావేత్తలు ఇచ్చే సూచనలు స్వీకరిస్తాం. వీసీల నియామకానికి ఇప్పటికే సెర్చ్ కమిటీలు వేశాం. త్వరలోనే నియామకాలు పూర్తవుతాయి” అని ముఖ్యమంత్రి వివరించారు.

విశ్వవిద్యాలయాల్లో గత పదేళ్లుగా నియామకాలు లేవని విద్యావేత్తలు, విశ్రాంత అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. యూనివర్సిటీల అభివృద్ధికి నిధులు కేటాయించాలని, ప్రతి 15 రోజులకోసారి విద్యావ్యవస్థపై సమీక్ష జరపాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు బోధన నైపుణ్యం ఉండటం లేదని, కేంద్రాల్లో సరైన వసతులు లేవని, ప్రభుత్వ పాఠశాలల్లో పలు సమస్యలు ఉన్నాయని వారు వివరించారు. విద్యా సూచికలో తెలంగాణ అట్టడుగున ఉందని, ఓయూలోనూ విద్యాప్రమాణాలు పడిపోయాయని ప్రొఫెసర్లు హరగోపాల్, శాంతా సిన్హా ఆవేదన వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థ బలోపేతానికి తాము ఇప్పటికే మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్‌లతో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశామని వారికి ముఖ్యమంత్రి తెలిపారు. విద్యావ్యవస్థలో తీసుకురావాల్సిన మార్పులపై విధానపత్రం రూపొందిస్తే.. దానిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆయా అంశాలపై మంత్రివర్గ ఉపసంఘంతోనూ చర్చించాలని వారికి సూచించారు.

# పెద్దవాగుకు భారీ గండి

వరద ఉధృతికి కొట్టుకుపోయిన పశువులు

కొండలు, గుట్టలపై తలదాచుకున్న ప్రజలు

భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి

చర్ల వద్ద తాలిపేరు కు వరద ఉధృతి

అధికారులను అప్రమత్తం చేసిన ప్రభుత్వం

గ్రామాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో సహాయక చర్యలకు వీలు లేకుండా పోయింది. ఎగువ ప్రాంతాల నుంచి వరద చేరడంతో భద్రాచలం వద్ద గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది.



2లో

## మైక్రోసాఫ్ట్ సర్వర్‌లలో సమస్యలు

విమానర సర్వీసలకు తీవ్ర అంతరాయం

ప్రయాణికులకు నీళ్లు, ఆహార సేవలు అందించాలి

అధికారులకు మంత్రి రామ్మోమన్ నాయుడు ఆదేశం




2లో

# రైతు సంక్షేమానికి పాల్పడ్డ ఘనత కెసిఆర్‌దే

**అనేక పథకాలతో వారికి అండగా నిలిచారు**

**ఇప్పుడే రైతులు నానా యాతన పడుతున్నారు**

**ఎక్స్ వేదికగా ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు**

**హైదరాబాద్:**తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్.. రైతును రాజు చేశారు. దండగన్న వ్యవసాయాన్ని పండుగ చేసిన ఘనత కేసీఆర్‌దేనని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారు. రెండు దఫాలుగా పంటల రుణమాఫీ చేశారు. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో రైతుకు, అతని కుటుంబానికి ఆర్థిక భరోసా నింపారు. కొత్త ప్రాజెక్టులతో పాటు పెండింగ్ ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించారు. 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించి రైతులకు కరెంట్ కష్టాల నుంచి విముక్తి చేశారు. వీటన్నింటితో పాటు మరిన్ని రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి.. రైతులను రాజులుగా తయారు చేశారు కేసీఆర్. కానీ అదే కాంగ్రెస్ గవర్నమెంట్‌లో రైతులు అరిగోస పడుతున్నారు. లక్ష రూపాయాల వరకు రుణమాఫీ అని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి.. చివరకు లక్ష వరకు రుణాలున్న చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదు. దీంతో రేవంత్ సర్కార్‌పై రైతులు ఆగ్రహంతో ఉన్నారు. రేషన్ కార్డు లేదని చాలా మందికి రుణాలు మాఫీ చేయలేదని సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. కేసీఆర్ హయాంలో సాగుకు స్వర్ణయుగం.. లక్ష కోట్లకు పైగా సంక్షేమం జరిగిందని తెలిపారు.



వేగుచుక్క
TELUGU DAILY NEWS
తెలంగాణం
2
శనివారం 20 జూలై 2024



# అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు

**హైదరాబాద్/విశాఖపట్టణం:** తీవ్ర అల్పపీడనం వాయవ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమమధ్య బంగాళాఖాతం ప్రాంతంలో వాయుగుండంగా కేంద్రీకృతమై ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాగల 24 గంటల్లో ఒడిశాలో తీరం దాటే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని పేర్కొంది. వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని, తెలంగాణపై దీని ప్రభావం ఇవాళ, రేపు ఎక్కువగా ఉంటుందని ప్రకటించింది. విస్తారంగా వర్షాలతో పాటు అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈశాన్య, తూర్పు జిల్లాలైన కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో శుక్రవారం అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, ఖమ్మం, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. శనివారం ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురవొచ్చు. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదారాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. అల్పపీడనం ప్రభావంతో ఏపీ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభించిపోయింది. నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డు, రామకృష్ణా థియేటర్ రోడ్డు, వెలమ వీధి, పూర్ణా మార్కెట్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. జ్ఞానాపురం పాతవంతెన వద్ద వరదనీరు నిలిచిపోయింది. విశాఖ ఆర్అండ్‌బీ కార్యాలయం నుంచి బిర్లా వరకు సర్వీసు రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తోంది. కార్యాలయాలు, పరిశ్రమలకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మోకాళ్ల లోతు నీటిలో వాహనాలు నడుపుతూ అవస్థలు పడ్డారు. ఏకధాటిగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

# స్నేహ సొసైటి" బోనాల జాతర.

## - నెత్తిన బోనాలతో ట్రాన్స్ జెండర్ల నృత్యాలు.








**వేగుచుక్కన్యూస్, నిజామాబాద్, జులై 19**

స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్స్ట్రక్షన్, స్నేహ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో బోనాల జాతర పండుగను ఘనంగా నిర్వహించారు. నెత్తిన బోనాలతో ట్రాన్స్ జెండర్ల నృత్యాలు చేయగా, పోతరాజుల వేష దారులు సందడి చేశారు.

మారుతి నగర్ లోని స్నేహ సొసైటి నుండి ప్రారంభమైన బోనాల జాతర గౌతంనగర్ లోని మైసమ్మ గుడి వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దిశ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ సుధాకర్ హాజరయ్యారు. ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రతి సంవత్సరం బోనాలు తీయడం, స్నేహ సొసైటీ సేవలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపల్ జ్యోతి తదితరులు హాజరయ్యారు.





## 8కోట్ల ఉద్యోగాల సృష్టి..

# మరో ట్రాష్

## ప్రధాని మోడీ ప్రకటనపై ఖర్గే మండిపాటు

**న్యూఢిల్లీ:** ఎనిమిది కోట్ల ఉద్యోగాలు సృష్టించామన్న ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటనను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శుక్రవారం తీవ్రంగా విమర్శించారు. ప్రధాని మోడీ 'ఒకదాని తరువాత ఒకటిగా అబద్ధం చెప్పడం' ద్వారా యువత 'పుండుపై కారం చల్లుతున్నారు' అని ఖర్గే ఆరోపించారు. గడచిన మూడు నాలుగు సంవత్సరాల్లో ఎనిమిది కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించడం నిరుద్యోగితపై తప్పుడు కథనాలు వ్యాప్తి చేసేవారి నోళ్లు 'మూతపడ్డాయి' అని ప్రధాని మోడీ క్రితం వారం ఉద్ఘాటించిన నేపథ్యంలో ఖర్గే ఈ విమర్శ చేశారు. ఉపాధి కల్పనపై ఆర్‌బిఐ ఇటీవల విడుదల చేసిన నివేదికను ప్రధాని ఉటంకిస్తూ, ఎన్‌డిఎ ప్రభుత్వం సుస్థిరత, వృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని నొక్కిచెప్పారు. చిన్న, పెద్ద స్థాయి మదుపరులు ఎన్‌డిఎ మూడవ హయాంను ఎంతో ఉత్సాహంతో స్వాగతించారని ఆయన తెలిపారు. 'నరేంద్ర మోడీజీ! ఉద్యోగాలపై ఒకదాని తరువాత ఒకటిగా అబద్దాలు చెబుతూ మీరు యువత పుండ్లపై కారం చల్లుతున్నారు' అని ఖర్గే 'ఎక్స్' పోస్ట్‌లో విమర్శించారు. 'అందుకే ఆర్‌బిఐ ప్రశ్నార్థక డేటాపై మిమ్మల్ని ప్రశ్నించాలని మేము అనుకుంటున్నాం/ మీరు పది సంవత్సరాల్లో 20 కోట్ల ఉద్యోగాలు వాగ్దానం చేసి 12 కోట్లకు పైగా ఉద్యోగాలను ఎందుకు పరిహరించారు?' అని ఖర్గే తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆర్‌బిఐ నివేదికకు ఆధారమైన ప్రభుత్వ పిఎల్‌ఎఫ్‌ఎస్ డేటా ప్రకారం పని చేసే మహిళల్లో 37 శాతం మందికి వేతనాల చెల్లింపులు జరగలేదన్నది నిజం కాదా అని ఖర్గే అడిగారు.

# పెద్దవాగుకు భారీ గండి

భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి సమీపంలో పెద్దవాగు ప్రాజెక్టుకు గురువారం రాత్రి భారీ గండి పడింది. దీంతో నీళ్లన్నీ దిగువకు వెళ్లడంతో ప్రాజెక్టు ఖాళీ అయింది. ప్రాజెక్టు కట్ట తెగి వందల సంఖ్యలో పశువులు కొట్టుకుపోయాయి. వరద ప్రవాహానికి వేల ఎకరాల్లో పంట దెబ్బతింది. పలు గ్రామాల ప్రజలు కొండలు, ఎత్తయిన భవనాల్లో రాత్రంతా తలదాచుకున్నారు. ఏం జరుగుతుందో తెలియక పరుగులు తీశారు. గ్రామాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో సహాయక చర్యలకు వీలు లేకుండా పోయింది. ఎగువ ప్రాంతాల నుంచి వరద చేరడంతో భద్రాచలం వద్ద గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. గురువారం 20 అడుగులు వద్ద ఉన్న వరద.. శుక్రవారం ఉదయం 9 గంటల సమయానికి 24.5 అడుగులకు చేరింది. గోదావరికి ఎగువ ప్రాంతంలో ఉన్న పేరూరులో ఉదయం 9 గంటలకు 40.86 అడుగులు నమోదైంది. ఇంద్రావతి, పేరూరు వైపు నుంచి వరద



భద్రాచలం గుండా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో భద్రాచలంలో ప్రమాద స్థాయికి వరద చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 43 అడుగులు వరద వస్తే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. 48 అడుగులకు వస్తే రెండు, 53 అడుగులకు వస్తే మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నారు. గోదావరి ప్రాంతంలో వర్షం కురవడంతో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న సెక్టోరియల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. గజ ఈతగాళ్లు, పడవలు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపుచర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద ఉద్ధృతి పెరుగుతోంది. ఎగువన ఉన్న చత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో శుక్రవారం 24 గేట్లు ఎత్తి 59 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువన గోదావరికి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 60,297 క్యూసెక్కుల ఇన్‌ఎ÷-లో వస్తోంది. ప్రాజెక్టులో క్రమేపీ వరద ఉద్ధృతి పెరుగుతున్నట్లు ప్రాజెక్టు ఏఈ ఉపేందర్ తెలిపారు. మరో పక్క చింతవాగు, పగిడి వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. దక్షిణ, ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనం గా మారింది. రానున్న 12 గంటల్లో ఇది వాయుగుండంగా మారే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో తెలంగాణలోని ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అతి నుంచి అత్యంత భారీ

వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే వీలుందని తెలిపింది.

హైదరాబాద్‌లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది.

# మైక్రోసాఫ్ట్ సర్వర్‌లలో సమస్యలు

**న్యూఢిల్లీ:** మైక్రోసాఫ్ట్ సర్వర్‌లలో సమస్యల కారణంగా విమాన సేవలు ప్రభావితమయ్యాయి. చాలా కంపెనీల విమానాలు ఎగరలేకపోతున్నాయి. భారతదేశంలో, ఢిల్లీ, ముంబై మరియు బెంగళూరు విమానాశ్రయాలలో విమానాలు షెడ్యూల్ కంటే ఆలస్యంగా నడుస్తున్నాయి. ఈ

సాంకేతిక సమస్యల తర్వాత భారత ప్రభుత్వం మైక్రోసాఫ్ట్‌ను సంప్రదించింది. అనేక దేశాల ప్రభుత్వాలు అత్యవసర సమావేశాలు ఏర్పాటు చేశాయి. స్పైస్‌జెట్, ఇండిగో,అకాసా ఎయిర్‌లైన్స్ కూడా ఇలాంటి సాంకేతిక సమస్యలను ఉదహరించాయి. ఇండిగో, స్పైస్‌జెట్ వంటి విమానయాన సంస్థలు సర్వర్ సమస్యల కారణంగా సర్వీసులు నిలిచిపోయాయని చెబుతున్నాయి. తాజాగా ఈ సమస్య పరిష్కారమైనట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సమస్య వల్ల విమానాశ్రయాల్లో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ అంశంపై తాజాగా పౌర విమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. అంతరాయం వల్ల ప్రభావితమైన ప్రయాణికులకు నీరు, ఆహారం అందిస్తుందని మంత్రి తెలిపారు.

ప్రయాణికుల పట్ల విమానాశ్రయ అధికారులు, విమానయాన సంస్థలు సానుభూతితో వ్యవహరించాలి. విమాన సర్వీసుల ఆలస్యం కారణంగా ప్రయాణికులకు అదనపు సీటింగ్, వాటర్, ఆహారాన్ని తప్పక అందించాలి. ప్రయాణీకుల సురక్షిత ప్రయాణం కోసం టెక్నికల్ టీమ్ కృషి చేస్తోంది. ఇలాంటి సమాయాల్లో ప్రయాణీకుల సహకారం కూడా తప్పకుండా అవసరం. టెక్నికల్ సమస్య, విమాన సర్వీసుల రాకపోకలపై ఎలాంటి అప్‌డేట్ ఉన్నా ప్రయాణీకులకు వెంటనే తెలియజేయాలి. విమానాశ్రయాల్లో ప్రయాణీకుల అవసరాల కోసం అదనపు సిబ్బందిని కూడా ఏర్పాటు చేశాం. మైక్రోసాఫ్ట్ సంస్థతో అధికారులు టచ్‌లోనే ఉన్నారు. వీలైనంత త్వరగా మామూలు పరిస్థితులు నెలకొంటాయని తెలిపారు.

# ఉజ్జయిని మహంకాళి బోనాలకు భారీగా ఏర్పాట్లు

**హైదరాబాద్:** సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని హైదరాబాద్ నార్త్ జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ చెప్పారు. 21,22న సికింద్రాబాద్ మహంకాళి బోనాలు జరగనున్నాయని తెలిపారు. ఆదివారం మహంకాళి బోనాలు,ఆ తర్వాత రోజు రంగం, అంబారీ కార్యక్రమం ఉంటుందన్నారు. బోనాల జాతర సందర్భంగా ఈ సారి నెల రోజుల నుంచి ఏర్పాట్లపై కసరత్తు చేశామని చెప్పారు. మహంకాళి బోనాలకు 1500 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. టెంపుల్ చుట్టూ పక్కల క్యూ లైన్లులో కలిపి మొత్తం 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని డీసీపీ రష్మి పెరుమాళ్ వెల్లడించారు. మహిళ భద్రత కోసం షీ టీంలు ఏర్పాటు చేశామని తెలిపారు.భక్తుల దర్శనానికి ఆరు క్యూ లైన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. అన్ని లైన్లలో ఒక ఎమర్జెన్సీ గేట్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఇందులో రెండు ప్రత్యేక లైన్స్ బోనాలతో వచ్చే వారికి ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన సామాన్య భక్తుల దర్శనం కోసం క్యూ లైన్ ఏర్పాటు చేశాము. మరో రెండు లైన్లు దేవాలయం పాసులు జారీ చేసిన వారికి ఏర్పాటు చేశాం. అమ్మవారికి బోనం సమర్పించేందుకు వచ్చే వారికి ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశాము. బోనం ఎత్తుకొని వచ్చే వారితో పాటు ఐదుగురికి అనుమతి ఉంటుంది. ప్రసాదం కౌంటర్ల కూడా ఈసారి ఎక్కువ గా ఏర్పాటు చేశాము. ఎగ్జిట్ పాయింట్ దగ్గర ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశాము. బోనాలకు వచ్చే వారు పోలీసులకు సహకరించాలి. గతేడాదితో పోల్చుకుంటే.. ఈసారి ఎక్కువ మంది వస్తారని అంచనా వేస్తున్నాము. అందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు డీసీపీ. భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు.10 నుంచి 15 లక్షలు మంది వస్తారని అంచనా. శివ శక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాము. ఉదయం వేళల్లో రద్దీ ఉంటుంది కాబట్టి. వాళ్లు దర్శనం చేసుకునేందుకు స్పెషల్ టైం 1:30నుండి 4 గంటల మధ్య వారు రావాలి.

# గ్రూప్-2 పరీక్షలు వాయిదా

## ఆగస్ట్ నుంచి డిసెంబర్‌కు వాయిదా వేస్తూ నిర్ణయం

హైదరాబాద్,: గ్రూప్-2 పరీక్షలను తెలంగాణ సర్కార్ వాయిదా వేసింది. ఆగస్టులో నిర్వహించాల్సిన పరీక్షలను డిసెంబర్‌కు వాయిదా వేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించాలని మొదట నిర్ణయించగా నిరుద్యోగుల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత రావడంతో పరీక్షల తేదీలను మార్చింది. డీఎస్సీ పరీక్షలు జులై 18నుంచి ఆగస్టు 5వరకు ఉండటం వెంటనే గ్రూప్-2పరీక్షలు ఉండడంతో అభ్యర్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో పలు ధర్నాల అనంతరం పరీక్షలను డిసెంబర్‌కు వాయిదా వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

డిసెంబర్‌లో నిర్వహించనున్న గ్రూప్-2 రాతపరీక్షల తేదీలను త్వరలోనే వెల్లడించనున్నారు.

గ్రూప్-2 వాయిదాతో పాటు పోస్టుల సంఖ్య పెంచాలని గత నెల రోజులుగా నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. కొద్ది రోజుల క్రితం టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించి తమ నిరసన వ్యక్తం చేశారు. దీంతో పాటు ఉస్మానియా యూనివర్సిటీ, అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్‌లో నిరుద్యోగులు పలు రకాలుగా నిరసనలు వ్యక్తం చేశారు. నిరసనలు, ఆందోళనల్లో పాల్గొన్న నిరుద్యోగులపై పోలీసులు ఉక్కుపాదం మోపి లాఠీలు ఝుళిపించారు.ఇటీవలే అశోక్‌నగర్‌లో అర్ధరాత్రి వేళ భారీ నిరసన చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. మొత్తం 783 పోస్టుల భర్తీకి గ్రూప్-2 నోటిఫికేషన్ వెలువడింది. ఈ పోస్టులకు 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వాయిదాతో పాటు పోస్టులు కూడా పెంచాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. 2 వేల పోస్టులు అదనంగా పెంచాలని నిరుద్యోగుల డిమాండ్. మరి పోస్టులు పెంచుతారా..? లేదా అనే దానిపై అనుమానం ఉందని నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




వేగుచుక్క
TELUGU DAILY NEWS


# రైతుల అభివృద్దే కాంగ్రెస్ లక్ష్యం.

**మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు నాగరాజ్ గౌడ్.**

**వేగుచుక్క న్యూస్,బీబీపేట్, జూలై 19:**

రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ చిత్రపటానికి మండలంలోని మాందాపూర్ గ్రామంలో నీ అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల రైతుబంధు సమితి అధ్యక్షులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తుందని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందనడానికి ఇదే నిదర్శనమన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వరంగల్ సభలో యువనేత రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ పేరిట రుణమాఫీ హామీ ఇచ్చారని, రైతులకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడం చారిత్రాత్మక నిర్ణయమని, ప్రకటించిన హామీ అమలు వల్ల రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుందనీ పేర్కొన్నారు. వైఎస్సార్ హయాంలో విద్యుత్ శాఖ మంత్రిగా రైతుల సంక్షేమం కోసం గ్రామ గ్రామాన సబ్ స్టేషన్లు మంజూరు చేసి లో ఓల్టేజ్ సమస్య తీర్చిన ఘనత షబ్బీర్ అలీ కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విజయ డైరీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రాకేష్ రెడ్డి, మాజీ అధ్యక్షులు పెద్ద రాజిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, రంగు శ్రీనివాస్, రాజు రెడ్డి, దయానంద్ గౌడ్, భాస్కర్, స్వామీ, ప్రేమ్ చారి, శ్రీనివాస్, ఎల్లం, లింగం, సిద్దరాములు, మాణిక్యం, ఎర్ర రాములు, నర్సింహరెడ్డి, చంద్రారెడ్డి, బాల్ రాజయ్య, విజయ్, పోశయ్య తదితరులు పాల్గొన్నారు.



# శ్రీచైతన్యలో "కుళ్లిన కూడు"

**విద్యార్థుల జీవితాలతో చెలగాటం.**

**బట్ట బయలు చేసిన పిడిఎస్ యూ విద్యార్థి సంఘం.**

**జిల్లా విద్యా శాఖ అధికారికి పిర్యాదు.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జులై 19**



కుళ్లిన కూరగాయలతో భోజనం పెడుతూ, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నా శ్రీ చైతన్య విద్యా సంస్థల గుట్టును పిడిఎస్ యూ విద్యార్థి సంఘం బట్టబయలు చేసిన ఘటన శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగింది. విద్యార్థుల ఫిర్యాదుతో పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ నేతృత్వంలో వెళ్లి శ్రీ చైతన్య విద్యాసంస్థల్లోనీ మెస్ లో కూరగాయలను పరిశీలించారు. అక్కడ కుళ్లిపోయిన కూరగాయలతో వంట చేయడాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నేరుగా వెళ్లి జిల్లా విద్యా శాఖ అధికారి దుర్గ ప్రసాద్ కు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ మాట్లాడుతూ, నగరంలోని శ్రీ చైతన్య విద్య సంస్థ లక్షల రూపాయలు ఫీజులు తీసుకుంటూ విద్యార్థులకు సరైనటువంటి భోజనం వండి పెట్టడం లేదని అన్నారు. కుళ్ళిన కూరగాయలు మెస్ లో ఉన్నాయని, నీళ్ల ఫ్రిజ్ లో మొత్తం కింద నాచు పేరుకుపోయిందని పేర్కొన్నారు. చనిపోయిన పురుగులు ఉన్నాయని, నాసిరకం భోజనం పెడుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. టాయిలెట్స్ సైతం శుభ్రంగా లేవని, దీనివల్ల విద్యార్థులు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని అన్నారు. అందువల్లశ్రీ చైతన్య విద్యా సంస్థల పైన కఠినమైన చర్యలు తీసుకోవాలని, హాస్టల్ పర్మిషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ నాయకులు ప్రిన్స్, రవీందర్, అక్షయ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.







# బడ్జెట్ లో 30 శాతం నిధులు కేటాయించాలి.

**- పిడిఎస్ యూ డిమాండ్.**




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జులై 19**

రాష్ట్ర బడ్జెట్ సమావేశాలలో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని పిడిఎస్ యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. గౌతమ్ కుమార్, జన్నారపు రాజేశ్వర్ లు డిమాండ్ చేశారు. నగరంలో కోటగల్లి నీలం రామచంద్రయ్య భవన్ లో శుక్రవారం పిడిఎస్ యూ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత పది సంవత్సరాల కాలంలో విద్యారంగాన్ని కెసిఆర్ ప్రభుత్వం భ్రష్టు పట్టించాదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్ లో 30 శాతం నిధులు కేటాయించాలని కోరారు. పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ లు 8 వేల కోట్ల రూపాయలు విడుదల చేయాలని అన్నారు. రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీలకు రెగ్యులర్ విసీలను నియమించాలని, మెస్ చార్జీలు పెంచి హాస్టల్స్ కి సొంత భవనాలు నిర్మించాలని అన్నారు. విద్యాశాఖ మంత్రినీ నియమించాలని, అసెంబ్లీ సమావేశలలో శ్రీ చైతన్య, నారాయణ విద్యాసంస్థలను రద్దు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ జిల్లా సహాయ కార్యదర్శులు ప్రిన్స్, దేవిక , జిల్లా నాయకులు నిఖిల్, మనోజ్, రవీందర్, రామకృష్ణ, అక్షయ్, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జూలై 19**




ప్రజల సౌకర్యార్థం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం పరిశీలించారు. ఇప్పటికే మున్సిపల్ పట్టణాలతో పాటు, అన్ని మండల కేంద్రాలలోని ఎంపీడీఓ కార్యాలయాలలో ప్రజా పాలన సేవా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ అన్నారు. అయితే వివిధ పనుల నిమిత్తం, సమస్యలు విన్నవిస్తూ అర్జీలు సమర్పించేందుకు అనునిత్యం ఐ.డీ.ఓ.సీ (కలెక్టరేట్)కు వచ్చే వారికి సైతం ప్రజాపాలన సేవా కేంద్రం అందుబాటులో ఉండాలని భావించి దీనిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలలోని వంట గ్యాస్ సిలిండర్ రాయితీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ తదితర పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పలు కారణాల వల్ల ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పొందలేకపోతున్న అర్హులైన దరఖాస్తుదారులు, ప్రజాపాలన సేవా కేంద్రాలను సందర్శించి ఏవైనా లోటుపాట్లు ఉంటే సరిచేయించుకోవచ్చని సూచించారు. కలెక్టరేట్లోని సేవా కేంద్రం ప్రభుత్వ కార్యాలయాల పని దినాలలో ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కలెక్టరేట్లో అందుబాటులోకి తెచ్చిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డేటా సవరణ కోసం వచ్చే దరఖాస్తుదారులు తమ వెంట రేషన్ కార్డ్, ఆధార్ కార్డు, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నెంబర్, గ్యాస్ కనెక్షన్ నెంబర్, ఎల్.పీ.జీ కస్టమర్ ఐడి, మొబైల్ నెంబర్ తీసుకురావాలని సూచించారు. కలెక్టర్ వెంట కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రశాంత్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్తిక్ తదితరులు ఉన్నారు.

# విద్య, వైద్య రంగాల పనితీరులో మార్పు రావాలి.

**కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.**

**మోర్తాడ్ సీ.హెచ్.సీ, గాండ్లపేట్ పాఠశాల తనిఖీ.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జూలై 19:**





విద్య, వైద్య రంగాల పనితీరులో స్పష్టమైన మార్పు కనిపించేలా సంబంధిత అధికారులు, సిబ్బంది అందరూ అంకిత భావంతో పని చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. శుక్రవారం ఆయన మోర్తాడ్ మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను, గాండ్లపేట్ లోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. సీ.హెచ్.సీ లోని లేబొరేటరీ రూమ్, ఆపరేషన్ థియేటర్, ఇన్ పేషంట్ వార్డ్, ఆక్సిజన్ ప్లాంట్, లేబర్ రూమ్, మెటర్నిటీ వార్డు, రోగులు, వారి సహాయకులకు భోజనం తయారు చేస్తున్న కిచెన్ రూమ్, వ్యాక్సినేషన్ గది తదితర వాటిని పరిశీలించారు. 30 పడకల సామర్థ్యం కలిగిన ఈ ఆసుపత్రిలో ప్రతిరోజూ ఎంతమంది రోగులు సందర్శిస్తారు, ఎంతమంది ఇన్ పేషంట్లుగా చేరుతున్నారు, సరిపడా వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారా? తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పాము కాటుకు గురైన వారికి స్థానికంగా చికిత్స అందిస్తున్నారా అని ఆరా తీశారు. సీ.హెచ్.సీలోనే కాన్పులు జరుగుతున్నాయా అని ప్రశ్నించగా, సాధారణ కాన్పులను స్థానికంగా నిర్వహిస్తున్నామని, సిజీరియన్ చేయాల్సిన కేసులను ఆర్మూర్ ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నామని మెడికల్ ఆఫీసర్ సమాధానం ఇచ్చారు. పాముకాటుకు గురైన వారికి కూడా ప్రాథమిక వైద్యం అందుబాటులో ఉందని, సరిపడా మందులను సిద్ధంగా ఉంచుకున్నామని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు ప్రబలేందుకు ఎక్కువ ఆస్కారం ఉంటుందని, అవసరమైన మందులు ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జ్వరం వంటి వ్యాధులతో చికిత్స కోసం వచ్చే వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, మలేరియా, డయేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వంటి వ్యాధులు సోకకుండా ముందస్తుగానే నివారణ చర్యలు చేపట్టాలని హితవు పలికారు. సీ.హెచ్.సీ పరిసరాల్లో పిచ్చిమొక్కలు పేరుకుపోయి ఉండడాన్ని గమనించిన కలెక్టర్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. వైద్యుల కొరత తీవ్రంగా ఉందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తేగా, నూతన భవనంలో అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నందున స్పెషలిస్ట్ డాక్టర్ల నియామకానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ ఆసుపత్రికి మార్చురీ మంజూరైనందున వెంటనే నిర్మాణాన్ని ప్రారంభించాలని పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. కాగా, గాండ్లపేట్ అప్పర్ ప్రైమరీ స్కూల్ లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను కలెక్టర్ పరిశీలించారు. పనులు పూర్తయినందున తక్షణమే ఎం.బీ రికార్డు పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని, తద్వారా వర్క్ ఏజెన్సీలకు బిల్లులు మంజూరు చేయవచ్చని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న బోధన తీరును కలెక్టర్ పరిశీలించారు. ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారా అని విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు కలెక్టర్ మోర్తాడ్ శివారులో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. మోర్తాడ్ ఎంపిడిఓ ఆఫీసులో కొనసాగుతున్న ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సందర్శించి, దరఖాస్తులు పరిష్కరిస్తున్న తీరును పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.వి.దుర్గాప్రసాద్, డీసీహెచ్ఎస్ డాక్టర్ శివశంకర్, మోర్తాడ్ మండల ప్రత్యేక అధికారి మధుసూదన్ తదితరులు ఉన్నారు.

# కస్తూరిబా పాఠశాలను సందర్శించిన కలెక్టర్.

**విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం.**

**ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.**

**వేగుచుక్క న్యూస్, ఎల్లారెడ్డి, జులై 19:**





కస్తూరిబా బాలికల పాఠశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పరిశీలించారు. తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదులలో మరమత్తు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థీనులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుకు సంబంధించి పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. సాంకేతిక విద్యను అధ్యాపకులు బోధిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ పాఠాలు తమకు బోధిస్తున్నారని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. విద్యార్థులు పట్టుదలతో చదివి భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థీనులకు పౌష్టికాహారం అందించాలని కోరారు. పాఠశాల ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించవలసిన బాధ్యత విద్యార్థీనులపై ఉందని తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. వర్షాకాలం దృష్ట్యా రోడ్లపై గుంతల్లో మురుగునీరు నిలవకుండా చూడాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ శ్రీహరిని ఆదేశించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని పెద్ద చెరువు ట్యాంక్ బండ్ నిర్మాణం పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణం పనులను సత్వరమే పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. పనుల పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎల్లారెడ్డి ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో ఉన్న మందులు, సిబ్బంది వివరాలను పర్యవేక్షణ అధికారి రవీంద్ర మోహన్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, ఇన్చార్జి జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, అటవీ, నీటిపారుదల, మున్సిపల్, విద్యుత్తు, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వం

**పెద్దపల్లి:** గత ప్రభుత్వం రైతులకు సబ్సిడీ విత్తనాలు ఇవ్వలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గిట్టుబాటు ధర కూడా కల్పించలేదని మండిపడ్డారు. రైతులు కాలర్ ఎగరేసుకున్న రోజు రావాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పెద్దపల్లిలో పర్యటించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు తదితరులు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ... ఆయిల్ ఫామ్ సాగుతో రైతులు ఆర్థికంగా బలపడతారని అన్నారు. భారతదేశంలో అత్యధికంగా ఆయిల్ ఫామ్ సాగు చేసే రాష్ట్రాల్లో తెలుగు రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని వివరించారు. ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు పూర్తిస్థాయిలో ప్రభుత్వం సహకరిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. దేశంలోనే మొదటిసారి రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసింది తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశంసించారు. రైతు రుణమాఫీ చేయడానికి నాయకత్వం వహించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ధన్యవాదాలు తెలిపారు. భారత దేశ చరిత్రలో మే 6 వ తేది 2022 లో ఇచ్చిన హామీని రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలో అనంతరం రెడ్డి ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసిన రైతుల సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రసంగించారు. ఇది కలనా నిజమా అని రైతులు అనుకుంటున్నారని, గత ప్రభుత్వం లక్ష రూపాయలు రుణమాఫీని నాలుగు, ఐదు విడుతలలో చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష రూపాయలు రుణమాఫీ ఒకసారి తరువాత లక్ష 50 వేలు, తరువాత 2 లక్షల రుణమాఫీ ఒకేసారి జరుగుతుందన్నారు. ఆయిల్ ఫామ్ కు ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఉన్న అన్ని ఖర్చులూ పొగ లక్షల్లో ఆదాయం వస్తుందని, ఆయిల్ ఫామ్ లో అంతర పంటలు వేసుకోవచ్చని సూచించారు. 2 లక్షల 103 మెట్రిక్ టన్నుల ఆయిల్ మార్కెట్ జరుగుతుంటే బయటి దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నామని, రాష్ట్రంలో 2 లక్షల ఎకరాల పైన ఆయిల్ ఫాం పెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, పెద్దపల్లి జిల్లాలో 45 వేల ఎకరాల్లో ఆయిల్ ఫాం పెట్టడానికి ఇక్కడ ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరినీ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

